





# కరపత్రం

SINCE 2014

మంగళవారం ఫిబ్రవరి 10, 2026 సంపుటి : 2 సంచిక : 125 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


## రెండేళ్ల అభివృద్ధిని చూసి ఓటేయండి

### పట్టణాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యం

- 12 ఏళ్ల బిజెపి పాలన, పదేళ్ల బిఆర్ఎస్ పాలన చూడండి
- రాష్ట్రంలో అనేక పథకాలతో అభివృద్ధి, సంక్షేమాన్ని చేపట్టాం
- మోడీకి మున్సిపల్ ఎన్నికలకు సంబంధం ఏమిటో
- తెలంగాణ రూపాయి ఇస్తే..42 పైసలే వాపస్ వస్తున్నాయి
- ఉత్తరాది బీహార్, యూపిలతో పోలిస్తే దారుణమైన పరిస్థితి
- దక్షిణాది రాష్ట్రాలపై కక్షగట్టిన ప్రధాని మోడీ
- దక్షిణాది సొమ్ముతో ఉత్తరాది రాష్ట్రాలకు సోకు
- ఇద్దరు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఏం చేస్తున్నట్లు
- మీడియా సమావేశంలో గణాంకాలతో వెల్లడించిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఫిబ్రవరి9 :**
మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు ఓటేయాలని, దీంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలన, 12 ఏళ్ల మోడీ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసుకుని అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసిన వేళ సిఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలకు మోడీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మోడీ ముఖం చూసి ఓటేయమని బిజెపి అడగడాన్ని ఎద్దేవా చేశారు. బిజెపి అధ్యక్షుడు ప్రచారంలో పాల్గొన్నా రాస్ట్రానికి ఒక్క పైసా ఉపయోగం లేదన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలుస్తూ భారీగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి దక్కాల్సిన వాటాలో తీవ్ర అన్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూస్తూ ఉత్తరాది రాష్ట్రాలకు కేంద్రం పెద్దపీట వేస్తోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా పన్నుల పునఃపంపిణీలో కేంద్రం అనుసరిస్తున్న తీరును ఆయన గణాంకాలతో సహా ఎండగట్టారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్తున్న ప్రతి రూపాయికి ప్రతిఫలంగా రాష్ట్రానికి కేవలం 42 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని, ఇది రాష్ట్ర ప్రయోజనాలపై గొడ్డలి పెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర పన్నుల వాటా పంపిణీలో ఉత్తరాది రాష్ట్రాలకు అందుతున్న నిధులపై సీఎం రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. తెలంగాణ వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రానికి నుంచి నిధులను సేకరించి, ఇతర రాష్ట్రాలకు కట్టబెడుతున్నారని ఆయన విమర్శించారు. ఉత్తరప్రదేశ్ రూపాయి పన్ను చెల్లిస్తే కేంద్రం ఆ రాష్ట్రానికి 2 రూపాయలు తిరిగి ఇస్తోందని, ఇక బీహార్ విషయానికొస్తే రూపాయికి బదులుగా ఏకంగా 6 రూపాయలు నిధులుగా వెళ్తున్నాయని ఆయన వివరించారు.

మిగతాద్ది 2 లో



## రెండేళ్ల తరవాత మళ్లీ అధికారం మాదే

- పాలన చేతకాక...హామీలను అటకెక్కించారు
- హామీల అమలుకు నిలదీస్తూనే ఉంటాం
- భూపాలపల్లి ప్రచారంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్

**జయశంకర్ భూపాలపల్లి,ఫిబ్రవరి9 :**
రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.రెండేళ్ల తర్వాత ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టమని హెచ్చరించారు. మా కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజు భూపాలపల్లిలో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. హామీలు అమలు చేయాలని బరాబర్ అడుగుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ వెంటపడుతూనే ఉంటామని తెలిపారు. అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల్లో గెలిస్తే కల్యాణలక్ష్మి డబ్బులతో పాటు తులం బంగారం ఇస్తానని అబద్దాలు చెప్పిండని అన్నారు. కానీ ఇప్పుడు మొఖం బాగోలేక అద్దం పగులగొట్టినట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఉన్నప్పుడు డిసెంబర్‌లోనే రైతుబంధు పడేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చినా రైతుబంధు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని రేవంత్ రెడ్డి అంటున్నాడని కేటీఆర్ తెలిపారు. నువ్వు పెట్టినవా తీసేయడానికి.. రెండేళ్లలో ఈ పొట్టోడు ఏం పీకిండని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే నీ వీపు చింతపండు చేస్తారని హెచ్చరించారు.

02




## ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారపర్వం

- 116 మున్సిపాలిటీలు ,7 మున్సిపల్ కార్పొరేషన్లలో హోరెత్తిన ప్రచారం
- 11న పోలింగ్‌కు ఎన్నికలసంఘం సర్వం ఏర్పాట్లు

**హైదరాబాద్,ఫిబ్రవరి9 :**
తెలంగాణ రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రచార పర్వం ముగిసింది. చివరిరోజు ఉధృతంగా ప్రచారం సాగింది.

2లో




## మున్సిపల్ ఎన్నికల వేళ

- రెండ్రోజులు పాటు మద్యం దుకాణాలు బంద్

**హైదరాబాద్,ఫిబ్రవరి9 :**
మద్యం ప్రియులకు మున్సిపల్ ఎన్నికలు షాక్ ఇచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ కీలక ప్రకటన చేసింది. రెండు రోజుల వైన్స్ బంద్ కానున్నాయి. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

## పదేళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడెలా చేస్తారు

- మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా మద్దతు మాకే
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా



**ఖమ్మం,ఫిబ్రవరి9 :**
రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉండి ఏమీ చేయలేనోళ్లు.. ఇప్పుడెట్ల అభివృద్ధి చేస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు, అధికారంలో ఉన్నప్పుడు దొర పోకడ తప్ప పేదోల కష్టాలు తెలుసుకోలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. పంచాయితీల్లో మద్దుత తెలిపనట్లే మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రాజమద్దతు తమకు ఉందన్నారు. చివరి రోజు ఆయన సుగిగాలి పర్యటనలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ వరి వేస్తే ఉరేనని చెప్పారని.. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సన్నబియ్యం పండించే రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ డబ్బులు కూడా చెల్లిస్తున్నామన్నారు. 'ప్రస్తుతం ఉన్నది దొరల పాలన కాదు.. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల సంక్షేమ ప్రభుత్వం' అన్నారు.

మిగతాద్ది 2 లో




## మధిరను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా

- రాజకీయాలు కాదు..అభివృద్ధి ముఖ్యం
- ఎన్నికల ప్రచార సభలో డిప్యూటి సిఎం భట్టి

**ఖమ్మం,ఫిబ్రవరి9 :**
మధిర పట్టణ రూపురేఖలను పూర్తిగా మార్చే బాధ్యత తనదేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మధిరలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్ తరహాలో మోడరన్ మహాప్రస్థానం శ్మశానవాటిక నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నా మని తెలిపారు. మధిరకు కావాల్సింది రాజకీయాలు కాదని, కేవలం అభివృద్ధి మాత్రమేనని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాలోని మధిర మున్సిపాలిటీలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భట్టి విక్రమార్క భారీ రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మధిర పట్టణ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత 10 సంవత్సరాలుగా మధిర మున్సిపాలిటీలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు.




## రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ చేసింది శూన్యం

- 420 హామీలు ఇచ్చి ఒక్క హామీనీ అమలు చేయలేదు
- మెదక్ పర్యటన అంటూనే వణుకుతున్న రేవంత్
- దుబ్బాక ప్రచారంలో సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్ధిపేట,ఫిబ్రవరి9 :**
రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే విమర్శించారు. 420 హామీలు ఇచ్చి ఒక్క హామీని అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. మెదక్ రావాలంటే రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందని హరీశ్‌రావు అన్నారు. అన్ని జిల్లాలు తిరుగుతున్న రేవంత్ రెడ్డి ఉమ్మడి మెదక్‌కు వచ్చేందుకు ముఖం లేదని విమర్శించారు.ఇక్కడ హరీశ్‌రావు ఉన్నాడని భయపడుతున్నాడని తెలిపారు. మహిళలకు ఫ్రీ బస్సు ఇచ్చారు.. కానీ రేవంత్ పాలన అంత తుస్సే అని అన్నారు.




## సింగరేణిని రక్షించేది భాజపా మాత్రమే: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**గోదావరిఖని:**
సింగరేణి సంస్థ అప్పుల ఊబిలో విలవిలాడుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోదావరిఖనిలోని గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. "బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణకు అన్యాయం చేశాయి.

## రాష్ట్రంలో పెరిగిన అత్యాచారాలు ,హత్యలు

- మున్సిపల్ ఎన్నికల తరవాత పన్నుపోటు
- సిఎం రేవంత్‌పై ఎంపి డికె ఆరుణ ఆరోపణలు

**మహబూబ్‌నగర్,ఫిబ్రవరి,ఫిబ్రవరి9 :**
రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దారుణాలు పెరిగిపోయాయని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ట్యాక్స్‌లు పెంచేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమవుతోందని ఆరోపించారు.

మిగతాది 2లో



కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం ఫిబ్రవరి 10, 2026

# మున్సిపల్ ఎన్నికల వేళ

మొదటి పేజీ తరువాయి

మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు సమయం ఆసన్నమవుతోంది. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. 13 ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఆయా మున్సిపాలిటీల పరిధిలోని మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. ఈనెల 9వ తేదీ నుంచి సాయంత్రం 5 గంటల నుంచి 11 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని ఎన్నికల, ఆబ్కారీ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా 13వ తేదీ వరకు ఫలితాల నేపథ్యంలో వైన్స్, బార్లు మూసివేయనున్నారు. మరోవైపు.. సోమవారంతో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. సాయంత్రానికి మైకులు మూగబోయాయి. గతానికి భిన్నంగా ఈసారి జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు అధికార, ప్రతిపక్షాల మధ్య యుద్ధ వాతావరణాన్ని తలపించాయి. వ్యూహాలు, ప్రతి వ్యూహాలతో రంగంలోకి దిగిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఒకరిపై మరొకరు పై చేయి సాధించాలన్న పట్టులతో ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలతో పాటు ఆయా పార్టీల నుంచి రెబల్స్ గా పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఇండిపెండెంట్ అభ్యర్దులు ప్రచారంలో మునిగి తేలారు. ర్యాలీలు, డప్పు చప్పుళ్లు, డీజే పాటల మోతలతో ప్రచారాన్ని హోరెత్తించారు. చివరి రోజు సుడిగాలి పర్యటనలకు నేతలు సిద్ధం అయ్యారు.

## పదేళ్లలో చేయని అభివృద్ధి
# ఇప్పుడెలా చేస్తారు

మొదటి పేజీ తరువాయి

బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వకుండా కమిషన్ల కోసం రూ. లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టారని విమర్శించారు. మొదట విడతగా రాష్ట్రంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని, ఏప్రిల్‌లో రెండో విడతతో పాటు మరో మూడు విడతల్లో ఇండ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. గత సర్కార్ మూతపడ్డ కోళ్లఫామ్స్, రైస్‌మిల్లుల్లో హాస్టళ్లు ఏర్పాటు చేస్తే.. తమ ప్రభుత్వం మాత్రం రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తోందన్నారు.

## రెండేళ్ల తరవాత మళ్లీ అధికారం మాదే

మొదటి పేజీ తరువాయి

భూపాలపల్లి జిల్లాను తెచ్చింది అభివృద్ధి చేసింది కేసీఆర్ అని తెలిపారు. సింగరేణి కాంట్రాక్టులను రేవంత్ రెడ్డి తన బామ్మర్దికి కట్టబెట్టిండని పేర్కొన్నారు. బొగ్గు కుంభకోణం బయటపెట్టామని ఫేక్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఓటుకు నోటు కేసులో ఆధారాలు ఉండకూడదని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో నిప్పు పెట్టి తగులబెట్టారని మండిపడ్డారు. తెలంగాణను ఆగం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని గల్లా పట్టుకుని అడగండని ఓటర్లకు పిలుపునిచ్చారు. తులం బంగారం ఎప్పుడిస్తావని అడగాలన్నారు. రేవంత్ రెడ్డికి ఓటుతోనే కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు. బూతుల ముఖ్యమంత్రికి పోలింగ్ బూత్‌లోనే బుద్ధి చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అన్ని వార్డుల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఇదిలావుంటే అసలు కాంగ్రెస్ వాళ్లు మసకబడితే నకిలీ తెలుగుదేశపోడు ముఖ్యమంత్రి అయ్యిండని రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జయశంకర్ భూపాలపల్లిలో కేటీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో అసలైన కార్యకర్తలు, నాయకులకు విలువ లేదన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ వాళ్ల మీద పెత్తనం చేసుకో అంతే కానీ కేసీఆర్‌ను ఒక్క మాటంటే బిడ్డా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమన్నారు.

# రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ చేసింది శూన్యం

మొదటి పేజీ తరువాయి

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీలో హరీశ్‌రావు పర్యటించారు. చెల్లాపూర్ వార్డులో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణను తెచ్చిన కేసీఆర్‌ను రేవంత్ తిడుతున్నాడని హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం తెచ్చి అభివృద్ధి పథకాలు అమలు చేయడం కేసీఆర్ తప్పా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్‌ను తిడితే ఓట్లు రావని.. పథకాలు అమలు చేస్తే వస్తాయని హితవుపలికారు. బూతులు మాట్లాడే రేవంత్‌కు పోలింగ్ బూత్‌లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పంద్రాగస్టుకల్లా రుణమాఫీ పూర్తి చేస్తానని దేవుళ్లపై రేవంత్ రెడ్డి ఒట్లు పెట్టిండని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, గ్యారంటీలు, గారడీలపై మెదక్ ప్రజలు నిలదీస్తారని ఇటువైపు చూడటం లేదని పేర్కొన్నారు. మెదక్‌లో రేవంత్ రెడ్డి ఒక్క వార్డులో కూడా గెలవడని తెలిపారు. రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ లేదు కానీ.. స్కామ్ క్యాలెండర్ అయితే ఇచ్చిండని విమర్శించారు. ప్రతి నెల ఏదో ఒక కుంభకోణం తెరపైకి తీసుకొచ్చాడని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డికి సురుకుపెట్టాలని అన్నారు. దుబ్బాక ఓటర్ల దెబ్బకు రేవంత్ రెడ్డికి దిమ్మ తిరగాలని అన్నారు. అలా కాకుండా కాంగ్రెస్‌కే ఓటేస్తే.. పథకాలు ఎగబెట్టినా నాకే ఓట్లు వేశారని రేవంత్ రెడ్డి అంటారని తెలిపారు. దుబ్బాకలో కాంగ్రెస్ ఏదైనా అభివృద్ధి చేస్తే చూపించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో డబ్బులు పంచి గెలవాలని రేవంత్ రెడ్డి అనుకుంటున్నాడని తెలిపారు. కేసీఆర్ ఇచ్చిన పథకాలు, అభివృద్ధితో పోలిస్తే ఈ డబ్బులు ఎంత అని ప్రశ్నించారు. దుబ్బాకలో బడి కట్టింది.. గుడి కట్టింది.. ఆస్పత్రి కట్టింది కేసీఆర్ అని గుర్తుచేశారు. రెండేళ్లలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. దుబ్బాకను ఇంకా అభివృద్ధి చేసే బాధ్యత తమదేనని హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి నోరు విప్పితే బూతులు తప్ప మంచిమాట రాదని అన్నారు. కేసీఆర్ హయాంలో భూముల విలువ పెరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక భూముల ధరలు తగ్గడమే కాదు.. తెలంగాణ ప్రతిష్ట కూడా దిగజారిందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి చేతిలో మోసపోని మనిషే లేదని పేర్కొన్నారు. హామీలు, గ్యారంటీల పేరుతో మోసం చేసి కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చారని విమర్శించారు. తెలంగాణ భవిష్యత్ గురించి ఆలోచించి ఓటేయాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డికి చురుకు తగిలితేనే పథకాలు అమలవుతాయని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

## మధిరను రోల్ మోడల్‌గా
# తీర్చిదిద్దుతా

మొదటి పేజీ తరువాయి

ప్రజల ఆశీస్సులు, సహకారంతో మధిర మున్సిపాలిటీలోని అన్ని వార్డులను కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అభ్యర్థుల గెలుపు రాజకీయాల కోసం కాదని.. అభివృద్ధి కోసమే అని చెప్పారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్–టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. డబ్బు ప్రధానం కాదని.. అభివృద్ధే ప్రధానమని, వ్యక్తులకన్నా వ్యవస్థలే ముఖ్యమని డిప్యూటీ సీఎం వివరించారు. మధిర మున్సిపాలిటీని రాష్ట్రానికి మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. ఏ అవసరం ఉన్నా ప్రజలందరికీ అండగా నిలుస్తానని చెప్పారు. విజ్ఞులైన ప్రతి ఒక్కరూ మధిర అభివృద్ధిపై తమ ఆలోచనలు పంచుకోవాలని కోరారు. మహిళలను వడ్డీలేని రుణాలతో స్వయం ఉపాధి వ్యాపారస్తులుగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# రెండేళ్ల అభివృద్ధిని చూసి ఓటేయండి

మొదటి పేజీ తరువాయి

ఈ స్థాయి వివక్షపై తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా పార్లమెంట్‌లో నోరు మెదిపారా అని ఆయన నిలదీశారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపించినందుకు తెలంగాణకు మీరు చేసిన మేలేమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పైకి విమర్శలు చేసుకుంటున్నప్పటికీ, లోపల మాత్రం ఆ రెండు పార్టీలు ఒక్కటేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన వివాదాస్పద రైతు వ్యతిరేక చట్టాలకు బీఆర్ఎస్ బేషరతుగా మద్దతు తెలిపిందని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా, నోట్ల రద్దు సమయంలో కేసీఆర్ అసెంబ్లీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి మరీ ప్రధాని మోదీని అభినందించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మోదీ ప్రేమలో అమరత్వం పొందుతానని గతంలో కేసీఆర్ చెప్పలేదా అని ఆయన ఎద్దేవా చేశారు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగినట్లుగా వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం బయటపడదని అనుకుంటున్నారని, కానీ బీఆర్ఎస్ , బీజేపీ మధ్య పక్కాగా 'క్విడ్ ప్రో కో' ఒప్పందం నడుస్తోందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అత్యంత ఖరీదైన ఫార్ములా–ఈ కారు రేస్ అక్రమాలకు సంబంధించిన ఫైల్స్ ఈడీ వద్ద ఉన్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేసినా కేంద్రం ఉదాసీనంగా వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేమిటని అడిగారు. బీఆర్ఎస్ నాయకులను కాపాడేందుకే బీజేపీ ఈ కేసులను అటకెక్కించిందని రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం తన ప్రభుత్వం పోరాటం కొనసాగిస్తుందని, కేంద్రం నుంచి రావాల్సిన ప్రతి పైసాను సాధించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తును ఆలోచించుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు. 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న భాజపా.. తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేసిందా? అని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని ప్రధాని మోదీనే స్వయంగా హామీ ఇచ్చారు. వాటి గురించి చెప్పట్లేదు.. కానీ, మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. వరదల్లో నీటమునిగిన వస్తువులన్నీ కేంద్రం నుంచి నిధులు తెచ్చి తిరిగిస్తామని గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఆ హామీని నమ్మి ఆ పార్టీకి చెందిన 50 మందిని కార్పొరేటర్లుగా గెలిపించారు. ఎన్నికలయ్యాక అడిగితే.. వస్తువులకు బీమా ఉంటుందని బండి సంజయ్ మాటమార్చారు. తెలంగాణకు రూ.లక్షల కోట్లు ఇచ్చామని భాజపా నేతలు చెబుతున్నారు. దీనిపై సీఎస్‌ను వివరణ అడిగితే.. మనం రూపాయి చెల్లిస్తే.. కేంద్రం 42 పైసలు ఇస్తోందని చెప్పారు. కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయి. తెలంగాణకు వచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారు. హైదరాబాద్‌కు వచ్చిన సెమీకండక్టర్ ప్రాజెక్టును మోదీ ఒత్తిడి చేసి.. ఏపీకి తరలించారు. ఇప్పుడు మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. అసలు మున్సిపల్ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధం? భాజపా నేతలకు దేవుడు అసదుద్దీన్ ఒవైసీ. ఆయన పేరు లేకుండా ఆ నేతల ప్రచారం ఉండదు. మత రాజకీయాల ద్వారా భాజపా రాజకీయ మనుగడ సాగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇకపోతే తెలంగాణ కోరిన మూసీ రివర్ ఫ్రంట్, ట్రిపుల్ ఆర్, మెట్రో విస్తరణ వంటి పథకాలపై ఎలాంటి కదలిక లేదన్నారు. అయితే తెలంగాణ అభివృద్ధికి తాము రెండేళ్లలో అనేక పనులు చేపట్టామని అన్నారు.

# ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారపర్వం

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ నుంచి మంత్రులు తమ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. బిజెపి, బిఆర్ఎస్ నేతలు కూడా ప్రచారంలో దూసుకుపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు , 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. అధికార , ప్రతిపక్ష పార్టీలు తమ సత్తా నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలను సెమీ ఫైనల్స్‌గా భావిస్తున్నాయి. అగ్రనేతల పర్యటనలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారంతో ఇన్నాళ్లూ మార్మోగిన వీధులన్నీ ఇప్పుడు నిశ్శబ్దంగా మారాయి. ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్‌లో ఓటర్లు ఎవరికి పట్టం కడతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల్లో ఓటర్ల బలం గణనీయంగా ఉంది. మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించు కోవడానికి మొత్తం 52,43,023 మంది ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఇందులో పురుష ఓటర్ల సంఖ్య 25,62,639 కాగా, 26,80,014 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం ఈ ఎన్నికల్లో కీలక పరిణామంగా కనిపిస్తోంది. వీరితో పాటు మరో 640 మంది ఇతర ఓటర్లు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,195 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికల కోసం 16,031 బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేశారు. పోలింగ్ పక్రియను పర్యవేక్షించేందుకు 1,379 మంది రిటర్నింగ్ ఆఫీసర్లు (ఖీక్ష), 1,547 మంది సహాయ రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు. క్షేత్రస్థాయిలో 9,560 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు (ఖక్ష), 31,428 మంది ఇతర సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరచడానికి 137 స్టాం÷-రగ్ రూమ్‌లు, ఫలితాల లెక్కింపు కోసం 136 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వం భారీ భద్రతను ఏర్పాటు చేసింది. సుమారు 25,000 మంది పోలీసు సిబ్బందితో రాష్ట్రవ్యాప్తంగా నిఘా పెంచారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించారు. ఎన్నికల పక్రియలో పూర్తి పారదర్శకతను పాటించేందుకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్ సదుపాయాన్ని కల్పించారు. దీని ద్వారా ఎన్నికల సంఘం అధికారులు నేరుగా పోలింగ్ సరళిని పర్యవేక్షించవచ్చు. మొత్తం 12,993 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరిని వరిస్తుందో చూడాలి. ఫిబ్రవరి 11న పోలింగ్ ముగిసిన తర్వాత, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఆ తర్వాత ఫిబ్రవరి 14న మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్లతో పాటు మున్సిపల్ చైర్మన్ , డిప్యూటీ చైర్మన్ల ఎన్నిక పక్రియ జరుగుతుంది. చివరగా ఫిబ్రవరి 16న కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం, ప్రత్యేక సమావేశంతో ఈ ఎన్నికల పక్రియ పూర్తి కానుంది.

## రాష్ట్రంలో పెరిగిన అత్యాచారాలు ,హత్యలు

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిపై ఎంపీ డీకే అరుణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఖజానాలో చిల్లిగవ్వ లేదని చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమవుతోందని విమర్శించారు.మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నానని అరుణ తెలిపారు. అన్ని మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు ప్రచారం నిర్వహించానని చెప్పుకొచ్చారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్, భూత్‌పూర్, జడ్చర్ల మున్సిపాలిటీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు అవసరముందని ఎంపీ అన్నారు.మహబూబ్‌నగర్ చుట్టుపక్కల గ్రామాలు విలీన గ్రామాలుగా కలిశాయని ఎంపీ అరుణ వివరించారు. కార్పొరేషన్ అభివృద్ధి కోసం మాస్టర్ ఎ÷-లాన్ కూడా అవసరం ఉందని చెప్పుకొచ్చారు. పట్టణాల్లో స్లమ్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులు ఎన్నికల్లో గెలవగానే సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. అవినీతి రహిత, పారదర్శకమైన పాలన అందించడమే బీజేపీ లక్ష్యమని ఉద్ఘాటించారు. ప్రతి వార్డులో డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై దృష్టి సారించి.. కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ మేనిఫెస్టోను ప్రజలకు అనుకూలంగా తయారుచేసి, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని డీకే అరుణ పేర్కొన్నారు.

# సింగరేణిని రక్షించేది భాజపా మాత్రమే: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

రామగుండం ప్రాంత అభివృద్ధి కోసం గత ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఇక్కడ ఎరువుల కర్మాగారం, పవర్ ప్రాజెక్టు తెచ్చింది భాజపా. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడులు పెడుతుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు. రామగుండంలో భాజపాను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తాం. రూ.20వేల కోట్లతో ఎన్టీపీసీని విస్తరిస్తాం. సింగరేణిని రక్షించుకోకపోతే మూతపడే ప్రమాదముంది. కార్మికుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటోంది.

తెలంగాణలో కారు పంక్చర్ అయింది. ఆ పార్టీలో ఉన్న నాయకులు తలో దారి చూసుకున్నారు. బీఆర్ఎస్‌లో జరిగిన అవినీతిపై కేసీఆర్ కుమార్తె కవిత కూడా చెబుతున్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.4వేలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఎవరికైనా ఇచ్చారా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదు. రౌడీయిజం, గూండాయిజంపై ఆ పార్టీ బతుకుతోంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు నడుస్తున్నాయి. కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సింగరేణిని రక్షించేది భాజపా మాత్రమే. కోల్‌బెల్ట్ ప్రాంతంలో కాషాయ జెండా ఎగిరితేనే సింగరేణికి మనుగడ ఉంటుంది. గతంలో బీఆర్ఎస్‌కు చెప్పిన విధంగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి. ఈ ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను ప్రజలు గెలిపించాలి" అని కిషన్‌రెడ్డి కోరారు.

## ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు సాగాలి

మున్సిపల్ ఎన్నికల్లో నేతలు సమన్వయంతో ముందుకెళ్లాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎన్నికల ప్రచారం, ఇతర అంశాలపై కాంగ్రెస్ ముఖ్యనేతలు, మంత్రులతో సీఎం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులపై సీఎం రేవంత్ ఆరా తీశారు. బలహీనంగా ఉన్న మున్సిపాలిటీల్లో పోలింగ్ వ్యూహంపై చర్చించారు. స్థానిక నేతల నేతృత్వంలో పోల్ మేనేజ్‌మెంట్ జరిగేలా చూడాలని మంత్రులకు సూచించారు.

# 11న మున్సిపల్ పరిధిలో సెలవు

ఈ నెల11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎన్నికలు జరిగే కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో పనిచేసే ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలకు ఈ నెల 11న స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ ఎన్నికల సంఘం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కోసం వినియోగిస్తున్న విద్యాసంస్థలు, ప్రభుత్వ భవనాలు, ఇతర పబ్లిక్ బిల్డింగ్స్ అన్నింటికీ 10, 11 న స్థానిక సెలవు దినంగా ప్రకటించారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ఈ నెల 11 నుండి 13 వరకు సెలవులు ప్రకటిస్తూ జారీ చేశారు.

# నేడు పోలింగ్ మెటీరియల్ పంపిణీ

### - ఎన్నికలు పక్కాగా నిర్వహించాలని కలెకట్ర్ ఆదేశం

మున్సిపల్ ఎలక్షన్లకు సంబంధించి ఈ నెల 10న పోలింగ్ మెటీరియల్ పంపిణీ సజావుగా నిర్వహించాలని జిల్లా ఎలక్షన్ ఆఫీసర్, కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. 11న పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి టిఫిన్, భోజనం, స్నాక్స్ వంటివి అందజేయాలని ఆదేశించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలని స్పష్టం చేశారు. 13 జరిగే కౌంటింగ్ పక్రియలో ఏజంట్లకు పరిమిత పాస్‌లు ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఎన్నికలు జరగనున్న హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీల పరిధిలో డ్రై డేలను ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ కే. హైమావతి అన్నారు. నేటి సాయంత్రం 5 గంటల నుంచి 11న పోలింగ్ పక్రియ ముగిసే వరకు, ఓట్ల లెక్కింపు 13న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు పక్రియ పూర్తి అయ్యే వరకు ఆయా మున్సిపాలిటీల పరిధిలో డ్రై డే గా ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా మున్సిపాలిటీల పరిధిలో మద్యం, రిటైల్ షాప్స్, బారులు, కల్లు దుకాణాలు అన్ని మూసి ఉంచాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మెదక్ జిల్లాలో పక్కాగా ఏర్పాట్లు

### - అల్లర్లు సృష్టిస్తే నాన్‌బెయిలబుల్ కేసులు: ఎస్పీ

మెదక్ జిల్లాలోని మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీ లకు సంబంధించి ఈ నెల 11న జరగనున్న ఎన్నికల కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు తెలిపారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. గొడవలకు పాల్పడినట్లయితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో సుమారు 600 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 75 వార్డులకు 150 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయని, ఇందులో 21 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టినట్లు వివరించారు. 1,206 మంది నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీ షీటర్లను ముందస్తు బైండోవర్ చేసినట్లు చెప్పారు. జిల్లాలో విస్తృత తనిఖీలు చేపట్టడంతో ఆదివారం వరకు రూ.2,69 లక్షల నగదు, 40 కేసుల్లో సుమారు రూ. 5,23,250 విలువైన 557.44 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రూ.3,36,000 విలువగల 336 గ్రాముల డ్రగ్స్, రూ.9,25,250 విలువైన ఫ్రీబీస్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎంసీసీ ఉల్లంఘించిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని ప్రజలను కోరారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం ఫిబ్రవరి 10, 2026

## ఎల్లంపేట చౌరస్తా వద్ద రోడ్డు ప్రమాదం





» యువకుడు మృతి

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లంపేట చౌరస్తా సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పప్పు కుమార్ రాణా (29) అనే యువకుడు మృతి చెందాడు. నాగ్‌పూర్ నుంచి మేడ్చల్ వైపు వస్తున్న లారీని నడుపుతున్న సంజయ్ కుమార్ విశ్వకర్మ (52) అదుపుతప్పడంతో రోడ్డు దాటుతున్న రాణాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాణా అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

## ప్రతాప సింగారంలో రెచ్చిపోయిన దొంగలు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతాపసింగారంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు ఓ ఎలక్ట్రికల్ అండ్ హార్డ్‌వేర్ షాపును లక్ష్యంగా చేసుకున్నారు. షట్టర్ తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడిన దొంగలు, కౌంటర్‌లో ఉన్న సుమారు రూ. 60 వేల నగదుతో పాటు ఒక మొబైల్ ట్యాబ్, ఇతర విలువైన సామగ్రిని దోచుకెళ్లారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మెట్టుపల్లి అభివృద్ధికి బిజెపి కౌన్సిలర్లను గెలిపించండి

» ఇబ్రహీంపట్నం బిజెపి నాయకులు



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జె గంగాధర్, మున్సిపాలిటీల అభివృద్ధికి బీజేపీ కౌన్సిలర్లను గెలిపించాలని కోరారు. మెట్‌పల్లి మున్సిపాలిటీలోని 26వ వార్డులో అభ్యర్థి బోడ్ల రమేష్ గెలుపునకు ర్యాలీ నిర్వహించారు. పట్టణాల, గ్రామాల అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని, అందుకు కౌన్సిలర్లను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు.

## కోరుట్లలో కాంగ్రెస్ బిజెపి హోరాహోరీ ప్రచారం



**కరపత్రం ప్రతినిధి కోరుట్ల**
జగిత్యాల జిల్లా, కోరుట్లలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం రసవత్తరంగా సాగుతోంది. ఈరోజు సాయంత్రం ఐదు గంటలకు ప్రచారం ముగియనుండగా, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు హోరాహోరీగా ర్యాలీలు నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నాయి. కాంగ్రెస్ నాయకులు ర్యాలీ చేస్తుండగా, వారి వెనుకే బీజేపీ నాయకులు 'జై శ్రీరామ్' నినాదాలు చేస్తూ తమదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. దీంతో పట్టణంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. నాలుగు రోజుల తర్వాత మున్సిపల్ పీఠం ఎవరికి దక్కుతుందో తేలనుంది.

## ప్రియురాలితో వీడియో కాల్ మాట్లాడుతూ

» ఉరి వేసుకున్న బాలుడు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడిపల్లి పిఎస్ పరిధి బోడుప్పల్ ఈస్ట్ బాలాజీ హిల్స్ లో నివసిస్తున్న ప్రైవేటు ఉద్యోగి కుమారుడు, గవర్నమెంట్ ఐటిఐ కాలేజీ రెండవ సంవత్సరం విద్యార్థి గంగాధరి అభినవ్ (17) తన ప్రియురాలికి వీడియో కాల్ చేసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 5న తల్లిదండ్రులు బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న అభినవ్, ఫ్యాన్ కు చున్నితో ఉరివేసుకున్నాడు. యువతి వెంటనే అభినవ్ స్నేహితులకు సమాచారం ఇవ్వడంతో, వారు ఇంటికి వెళ్లి డోర్ తెరిచి అతన్ని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

## ఓటకు నోటు సాక్ష్యాలు దగ్ధం

నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదం లో ఓటుకు నోటు కేసు సాక్ష్యాలను కాల్చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. అనుచిత వ్యాఖ్యలు చేసే సీఎం రేవంత్‌రెడ్డికి పోలింగ్ కేంద్రంలోనే బుద్ధి చెప్పాలని అన్నారు. 420 హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. భూపాలపల్లి సింగరేణిని ఆగం చేసేందుకు చూస్తున్నారని ఆరోపణలు చేశారు. తులం బంగారం, రూ.4వేల పెన్షన్ వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయాలని అన్నారు. కేసీఆర్ పథకాలు తీసుకుంటున్న వాళ్లు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఇవ్వాళ, రేపు మద్యం, డబ్బులు పంచి ఓట్లు వేయించుకోవాలని చూస్తారని ఎద్దేవా చేశారు. మరోసారి మోసపోయి భస్మాసుర చేయి లాంటి కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని సూచించారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆగ్రహించారు. 12ఏళ్లలో తెలంగాణకు బీజేపీ నయాపైసా పనిచేయలేదని అయ్యారు.

## మీ ఇంటి బిడ్డగా మీ ముందుకు వస్తున్న ఆదరించండి ఆశీర్వదించండి

» ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానని హామీ కేతోజి వినోద్ కుమార్





**గజ్వేల్ ఫిబ్రవరి 9,కరపత్రం ప్రతినిధి**
గజ్వేల్ ప్రజ్ఞపూర్ 6 వ వార్డు ప్రజలు స్వతంత్ర అభ్యర్థిగా కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న మా అమ్మ కేతోజి కరుణను గెలిపించండి అభివృద్ధి చేసి చూపిస్తా అని కేతోజి వినోద్ కుమార్ అన్నారు ఈ సందర్భంగా కేతోజి వినోద్ కుమార్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా పాలకులు లోపాలను కొట్టొచ్చినట్టు కాలనీలో ఎక్కడపడితే అక్కడ సమస్యలు కనబడతా ఉన్నది గత పాలకులు ఉన్నటువంటి టిఆర్ఎస్ కాంగ్రెస్ గాని అధికారంలో ఉన్న కాంగ్రెస్ కూడా మున్సిపాలిటీలో ఎక్కడ అభివృద్ధి చేసిరని ప్రశ్నిస్తున్నాను అలాగే ఈరోజు టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ బిజెపి పార్టీ వ్యక్తులు ఏ రోజు కాలిని యొక్క సమస్యను ఆరొవ వార్డ్ లో ప్రజ్ఞాపూర్ కానీ లక్ష్మీ ప్రసన్న కాలనీ సిరి కాలనీ బాలాజీ ఎంక్లేవ్ శివాలయం ఆఫీసర్ కాలనీ బసవేశ్వర కాలనీ ఎవరికి సమస్యలు తీర్చారు మీరు ఏ మొఖం పెట్టుకొని ఓట్ల అడుగుతున్నారు మీ ఆలోచన అంతా కండ్ల ముందు కనబడుతుంది ఈ ఎలక్షన్లో చికెన్ మందు పంపిణీ చేస్తూ మందు సీసాలతో డబ్బులు తో ఓట్లను కొనవచ్చు అని ప్రజాస్వామ్యాన్ని కూల్చే విధంగా కనబడుతుంది ప్రజలారా మీరు చెప్పే మాటలకు మీరు చేసే అవినీతి పనులకు మీరు చేసే చిల్లర రాజకీయాలకు కు ప్రజలు లొంగవు ఎందుకంటే గజ్వేల్ పట్టణ పూర్తిస్థాయిలో విద్యావంతులు ఉన్న కాలనీ అంటే అది ఆరోవ వార్డ్ మాత్రమే అది ఈ కాలనీవాసులు గమనిస్తూ ఉన్నారు అని తెలిపారు మీకు నిరంతరం అందుబాటులో ఉంటూ మీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని, అవకాశం ఇవ్వండి ఓటు వేయడం మీ వంతు అభివృద్ధి చేయడం మా వంతు మీరూ అందరూ ఆశీర్వదించాలని కోరారు, ఆరో వార్డులో ఎన్నో సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా మేము కృషి చేస్తామని అన్నారు,. కౌన్సిలర్ అభ్యర్థి గా మ అమ్మ కేతోజి కరుణ మీ ముందుకు వస్తున్నారని వార్డ్ అభివృద్ధి ధ్యేయంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని చెప్పారు మీ అమూల్యమైన ఓటు బ్యాటు గుర్తు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు

## సంగారెడ్డి మున్సిపాలిటీలో పర్యటించిన మాజీ మంత్రి హరీష్ రావ్

» మా చెల్లె రాస విజయలక్ష్మి ని భారీ మెజారిటీ తో గెలిపించండి





**కరపత్రం ప్రతినిధి సంగరెడ్డి**
సంగారెడ్డి లో రోడషో లో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావ్ గారు మాట్లాడుతూ గెజిటెడ్ ఆఫీసర్గా రిటైడ్ అయి మీకు సేవచేసుకోవడానికి వచ్చిన మా ఉద్యమ నాయకురాలు మా చెల్లె విజయలక్ష్మి ని 6 వ వార్డులో భారీ మెజారిటతో గెలిపించాలని మాజీ మంత్రి హరీష్ రావ్ గారు కోరారు
ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారు మాట్లాడుతూ దీటం అభ్యర్థులను మాత్రమే గెలిపించండి 6వ వార్డులో రాస విజయలక్ష్మి గారిని భారీ మెజారిటీ తో గెలిపించండి అని కోరారు ఎన్నికలు రాగానే ప్రతీ రాజకీయ పార్టీ ఓట్ల కోసం మన దగ్గరికి రావడం సహజం. ఆనవాయితీ కూడా. ప్రతీ నాయకుడు ప్రజలపై నిజమైన ప్రేమ ఉన్నట్లే మాట్లాడతారు. అరచేతిలో వైకుంఠం చూపుతారు. మోసపూరిత మాటలతో మాయ చేయాలని చూస్తారు. వివేకవంతులమైన, విజ్ఞానవంతులమైన మనం నిజానిజాలు ఆలోచించాల్సిన సమయం ఇది. ఎవరి వల్ల మన సంగారెడ్డి అభివృద్ధి చెందింది? ముందు ముందు జరుగుతుంది? ఎవరి వల్ల మన సంగారెడ్డి ప్రజలకు మేలు కలిగింది అనే విషయాలు లోతుగా పరిశీలించాలని మిమ్మల్ని కోరుతున్నాను. మన ఉమ్మడి జిల్లాకే చెందిన కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా, మన అన్న హరీశన్న మంత్రిగా ఉండి మన సంగారెడ్డి పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. దాని వల్ల చరిత్రలో ఎన్నడూ లేనన్ని పనులు మనం చేసుకోగలిగాం. సంగారెడ్డిని జిల్లా చేసుకోగలిగాం. సంగారెడ్డిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసుకోగలిగాం. ఇంకా అనేక పనులు చేసుకున్నాం. మొత్తం 822 కోట్ల రూపాయలు ఖర్చు చేసి, ఎన్నో పనులు చేసుకున్నాం. బిఆర్ఎస్ హయాంలో సంగారెడ్డిలో జరిగిన పనులు మన కళ్లముందే ఉన్నాయి. కాంగ్రెస్ పాలన వచ్చి రెండేళ్లు దాటింది. ఈ సమయంలో ముఖ్యమంత్రి నుంచి గానీ, ప్రభుత్వం నుంచి గానీ, జిల్లా మంత్రి నుంచి గానీ ఒక్కటంటే ఒక్క రూపాయయినా అదనంగా వచ్చిందా? కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారు ప్రత్యేక ప్రేమతో మన సంగారెడ్డి పట్టణానికి 50 కోట్ల రూపాయలు అందించారు. వాటితో ఎన్నో పనులు చేసుకున్నాం. కాంగ్రెస్ నాయకులు తమ ముఖ్యమంత్రిని ఒప్పించి 50 పైసలైనా తెచ్చారా? ఈ జిల్లాకు చెందిన మంత్రి సంగారెడ్డికి ఏమి చేశారు? మీరే ఆలోచించండి. సంగారెడ్డి పట్టణానికి ఏమైనా మేలు కలిగింది అంటే అది కేవలం బిఆర్ఎస్ వల్ల మాత్రమే అని మనందరికీ తెలుసు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక మనకు మేలు కలగక పోగా అనేక విధాల నష్టం జరిగింది. మనం బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాంక్షన్ చేయించిన అనేక పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, మినీ హాజ్ హౌజ తో పాటు అనేక పనులకు నిధులు లేక ఆగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం సంగారెడ్డి మీద చూపెడుతున్న నిర్లక్ష్యానికి మధ్యలో ఆగిపోయి పనులు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. సంగారెడ్డి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా లేదు. ఈ విషయం మనకు అర్థమయిపోయింది. సంగారెడ్డి అభివృద్ధి కావాలి అంటే ఎతీం అభ్యర్థులనే గెలిపించండి అని చింతా ప్రభాకర్ గారు అన్నారు కార్యక్రమం లో టౌన్ ప్రెసిడెంట్ ఆర్ వెంకటేశ్వర్లు,అజ్జు భాయ్, సాబెరు, నాని, మహేందర్, తదితరులు పాల్గొన్నారు

## గజ్వేల్ అమృత్ సిటీ కావాలంటే బీజేపీతోనే సాధ్యం మరెవరితో కాదు

» నా గొంతుకు మీ గొంతు తోడై మా అభ్యర్థులను గెలిపించాలి
» ఎంపీ రఘునందన్ రావు



**గజ్వేల్ ఫిబ్రవరి 09, కరపత్రం ప్రతినిధి**
గజ్వేల్ ఇందిరా పార్క్ చౌరస్తాలో బీజేపీ ఎన్నికల ప్రచార సభ, సభలో పాల్గొని భాజపా అభ్యర్థులను గెలిపించాలని కోరిన ఎంపీ రఘునందన్ రావు,జిల్లా అధ్యక్షుడు భైరీ శంకర్ రఘునందన్ రావు నా గొంతుకు మీ గొంతు తోడై మా అభ్యర్థులను గెలిపించాలి అన్నారు
హరీష్ రావు నిన్ను కరీంనగర్ తరిమికొట్టేదాక వదలను అంటూ మాజీ మంత్రి హరీష్ రావుపై ఎంపీ రఘునందన్ రావు ఘాట్ వ్యాఖ్యలు చేశారు. నా నోట్లో నోరు పెట్టాలను కుంటే మున్సిపల్ ఎన్నికల తర్వాత మీరు ఎంతమంది వస్తారో రండి నేనొక్కడినే వస్తా తేల్చుకుందాం అంటూ హెచ్చరిక చేశారు రఘునందన్. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఇందిరమ్మ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బిజెపి ప్రచార సభలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ బిడ్డ వాళ్ళ అయ్యా కేసీఆర్ ను అడిగింది ఏం పీకి కట్టలు కట్టడానికి దేశం మీదకు పోదాం అని అన్నారంటూ గుర్తు చేశారు. గజ్వేల్ ఇందిరమ్మ బొమ్మ సాక్షిగా చెప్తున్న హరీష్ రావు నిన్ను కరీంనగర్ తరిమి కొట్టేదాక వదలను అని హెచ్చరించారు. హరీష్ రావుకు ఏం సంబంధం సిద్దిపేట,గజ్వేల్ కు అని రాష్ట్రంలో 610 జీవో అమలు జరగాలి హరీష్ రావు కరీంనగర్ కి పోవాలని పేర్కొన్నారు. మీ లెక్క పాలిటెక్నిక్ సాధువుకున్నోడినీ కాదు, ప్రభాకర్ రెడ్డి లాగ బస్ డ్రైవర్ ను కాదని విజ్ఞత కలిగిన వాడనన్నారు. జర విలువ కాపాడుకోండి హరీష్ రావు లేకపోతే సిద్దిపేట బస్టాండ్ దగ్గరకు వస్తా ఇకా అని హెచ్చరించారు ఆయన. ఇక గజ్వేల్ ప్రజలు నమ్మి ఓట్లు వేస్తే ఒక్కసారైనా మీ బాధలు చూడడానికి వచ్చాడా కేసీఆర్ అంటూ ప్రజలను అడిగారు రఘునందన్ రావు. అక్క చెల్లెలు తల నిండా పూలు పెట్టుకుని పోలింగ్ కేంద్రానికి వెళ్ళి పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను ఎంపీ కోరారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్ గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ రాష్ట్ర బిజెపి నాయకుడు నందన్ గౌడ్ ములుగు మండలం అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్ సురేష్ బండారు మహేష్.హిమగిరి బార్ అరవింద్ , పేర్ల శ్రీనివాస్ దామరంచ దయాకర్ రెడ్డి బిజెపి కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు

## ప్రజా విశ్వాసమే రాజకీయ మూలధనం... ప్రజాసేవే పాలనా ధ్యేయం

- పేట్ బషీరాబాద్ క్యాంప్ కార్యాలయంలో రోజువారీ ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్



**పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 9 కరపత్రం ప్రతినిధి**
ప్రజల సమస్యల పరిష్కారమే తన రాజకీయ ప్రస్థానానికి దిక్సూచిగా భావిస్తూ, ప్రజలతో నేరుగా మమేకమై పాలనను ప్రజలకు చేరువ చేయడమే తన ప్రధాన లక్ష్యమని బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ స్పష్టం చేశారు. పేట్ బషీరాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన రోజువారీ ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరిచారు.
ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తమ వ్యక్తిగత సమస్యలు, మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన వినతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే , సమస్యల స్వభావాన్ని తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులతో తక్షణమే సమన్వయం చేసుకుని వేగంగా పరిష్కార చర్యలు చేపడతామని స్పష్టమైన హామీ ఇచ్చారు.
అలాగే సామాజిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వానాలను ప్రజల నుంచి స్వీకరించిన ఎమ్మెల్యే , ప్రజా జీవితంలో ప్రజలతో నిరంతరం కలిసిమెలిసి ఉండటమే తన రాజకీయ విధానమని వెల్లడించారు. ప్రజల నమ్మకమే తనకు అసలైన రాజకీయ బలమని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ మాట్లాడుతూ, "ప్రజలే నా బలం... వారి నమ్మకమే నా ప్రేరణ. ప్రజలతో పాటు నడుస్తూ సేవ చేయడమే నా ధ్యేయం. కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలబెట్టడమే నా రాజకీయ లక్ష్యం" అని స్పష్టం చేశారు. ఈ ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాల నాయకులు, సభ్యులు, వివిధ కాలనీల వాసులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే కి తమ మద్దతు తెలిపారు.

## ఓటు కోసం నేతల పాట్లు

**- ఎక్కడెక్కడో ఉన్న వారి కోసం ఆరా - వచ్చేవారికి ఆఫర్లతో రప్పించే యత్నం**

మున్సిపాలిటీ ఎన్నికలకు ఒక్కరోజే సమయం ఉండడంతో ఓట్లు వేసే వారి గురించి అభ్యర్థులు ఆరా తీస్తున్నారు. ఉపాధి, ఉద్యోగాల కోసం వెళ్లిన వారిని రప్పించేందుకు రంగంలోకి దిగారు. బరిలో ఉన్న అభ్యర్థులు తమ వార్డులోని ఓటర్లు ఎక్కడెక్కడ ఉన్నారు.. ఎవరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని ఆరా తీస్తూ వారిని ప్రసన్నం చేసుకునేందుకు పరుగులు పెడుతున్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు ఒక్క రోజే ఉండడంతో గెలుపే లక్ష్యంగా ఓటర్లను తమ వైపు తిప్పుకునేలా పలువురు అభ్యర్థులు హామీలతో పాటు ఆఫర్లు ఇస్తున్నారు. గంపగుత్త ఓట్లను రాబట్టేందుకు కులసంఘాలకు భారీగా తాయిలాలతో గాలం వేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పట్టణాల్లో ఓటర్లు వివిధ పనులో బీజిగా ఉంటుండడంతో అభ్యర్థులు తెల్లవారగానే ఓటర్ల ఇళ్లకు అభ్యర్థులు తమ అనుచరగణంతో కాలనీల్లోని పలువురి ఇళ్లకు వెళ్లి ఓట్లు అడుగుతున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో ఆయా వార్డుల్లో ప్రధాన వీధుల్లో పర్యటిస్తూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ అభ్యర్థుల గుర్తులతో కూడిన కరపత్రాలను ఓటర్లకు అందిస్తూ తమకే ఓటు వేయాలని ప్రాధేయపడుతున్నారు. ఈనెల 11వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్ దేవుళ్ళు ఓటు వేసి ఎవరిని గెలిపిస్తారో వేచి చూడాల్సిందే. మున్సిపల్ ఎన్నికల్లో ఒక్కో ఓటు కీలకం కానుంది. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అభ్యర్థులు ఒక్కో ఓటు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. అభ్యర్థులు మున్సిపల్ ఎన్నికల్లో ప్రతీ ఓటు తమకే పడేలా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఓటరు జాబితాలో నమోదైన ఓటర్ల ఇంటింటికి అభ్యర్థులు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఉద్యోగాలు, ఉపాధి రీత్యా ఇతర పట్టణాలకు ప్రాంతాలకు వలస వెళ్లిన పట్టణ ఓటర్లను రప్పించేందుకు అభ్యర్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటరు జాబితాలో నమోదై స్థానికంగా ఉండని వారిని తమవైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. తమ మద్దతుదారులు ఎవరెవరు ఎక్కడ ఉన్నారనే వివరాలను సేకరించి వారితో రోజుకు ఒకసారైన మాట్లాడుతూ తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. ఎక్కువ మంది ఓటర్లు ఉంటే వారి వద్దకు తమ సన్నిహితులను పంపిస్తున్నారు. ఎన్నికల్లో తమకు ఓటు వేసే విధంగా వ్యక్తి గతంగా ముఖముఖీగా మాట్లాడిస్తున్నారు. ముగ్గురు, నలుగురు, అంతకంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే ప్రత్యేక వాహనాలు సమకుర్చేందుకు సిద్ధవుతున్నారు. ఒకరిద్దరు ఓటర్లు ఉన్నా వారు కోరితే వాహన సదుపాయం కల్పిస్తామని, లేదంటే రాకపోకలకు రవాణా ఖర్చులతో పాటు ఇతర ఖర్చులు ముందుగానే అందిస్తామని చెబుతున్నారు. ఆలస్యం చేస్తే తమ పోటీదారులు వలస ఓటర్ల నుంచి ఎక్కడ మాట తీసుకుంటారోనని అప్రమత్తమవుతున్నారు. దీంతో ఎవరికివారు ముందుగానే వలస ఓటర్లను సంప్రదించి మాట తీసుకుంటున్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
మంగళవారం ఫిబ్రవరి 10, 2026

# కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు ఇవ్వాల్సిందే

- టి యు డబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్
- సంఘీభావంగా ఒకరోజు ప్రసారాలు నిలపాలని వినతి..
- కొన్ని గంటల పాటు కేబుల్ ప్రసారాలు ఆపుతామన్న ఎం ఎస్ ఓ లు





**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్**
కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు వచ్చేవరకు ఈ ప్రభుత్వంపై పోరాటం చేసి సాధించేందుకు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం అండగా ఉంటుందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ స్పష్టం చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన రౌండ్ టేబుల్ కాన్ఫిరెన్స్ లో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ల సంఖ్యను భారీగా తగ్గించడానికి 252 జీవోను ఈ ప్రభుత్వం తీసుకువచ్చి తీరని అన్యాయం చేసిందని, గతంలో 239 జీవో ద్వారా 23 వేల అక్రిడిటేషన్లు అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో నాటి మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ గారు ఇస్తే ఆ సంఖ్యను పదివేల దాకా తగ్గించే దిశగా ఈ నూతన జీఓ వచ్చిందని ఆరోపించారు. అనేక పోరాటాలు చేసిన అనంతరం సవరణ జీవో 103 తీసుకువచ్చినప్పటికీ జర్నలిస్టులందరికీ న్యాయం జరగలేదని, కేవలం విభజించి పాలించాలన్న డెస్క్, బ్యూరో జర్నలిస్టులకు ఒకే రకమైన కార్డు మాత్రం ఇస్తామని ప్రకటించినప్పటికీ కేబుల్ జర్నలిస్టులకు సవరణ జీవోలో కూడా ఏమాత్రం న్యాయం జరగకపోవడం అన్యాయం అన్నారు. గతంలో ఐ అండ్ పి ఆర్ ద్వారా దాదాపు 44 కేబుల్ చానల్స్ కు రాష్ట్ర స్టయిల్ 12 కార్డులు చొప్పున జారీ చేయడం జరిగిందని, ప్రస్తుతం ఆ సంఖ్యను సున్నాకు పరిమితం చేయడం ఏం న్యాయమని ప్రశ్నించారు. కేబుల్ రిపోర్టర్లకు న్యాయం జరిగే విషయంలో అవసరమైతే కోర్టుమెట్లు ఎక్కుతామని ప్రకటించారు. కేబుల్ జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ సంఘీభావంగా మల్టీ సిగ్నల్ ఆపరేటర్లు ఒకరోజు కేబుల్ ప్రసారాలను కొన్ని గంటలపాటు నిలుపుదల చేసి తమ నిరసన తెలపాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం నిరంకుశ ధోరణితో ముందుకు సాగుతోందని జర్నలిస్టులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా భవిష్యత్తులో మళ్లీ అధికారంలోకి వచ్చిన సందర్భం లేదని చెప్పారు. కేబుల్ చానల్స్ ను, శాటిలైట్ ఛానల్స్ ను వేరుగా చూడరాదని, అన్ని చానల్స్ లో పనిచేసేది జర్నలిస్టులే అనే విషయాన్ని ప్రభుత్వం గుర్తు ఎరగాలన్నారు. ఎం ఎస్ ఓ ల సంఘం నాయకులు కొల్ల కిషోర్ మాట్లాడుతూ మల్టీ సిగ్నల్ ఆపరేటర్ల దృష్టిలో శాటిలైట్ ఛానల్ అయినా కేబుల్ ఛానల్ అయిన ఒకటే అని, అన్ని చానళ్లు కూడా వార్త ప్రసాదాలు అందిస్తాయన్నారు. కేబుల్ చానల్స్ రిపోర్టర్స్ కు అన్యాయం జరిగితే ఒకరోజు కేబుల్ ప్రసారాలను నిలుపుదల చేసి తమ సత్తా ఏంటో చాటుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేబుల్ చానల్స్ నిర్వాహకులు,నాయకులు కడకంచి వెంకట్ ,చారి, శివ, భరత్ మాట్లాడుతూ తమకు న్యాయం జరిగే విషయంలో ప్రస్తుత మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తన పదవికి రాజీనామా చేసి సంఘీభావం తెలపాలని కోరారు.

# ప్రజా ఆరోగ్యం పరిరక్షించే దిశగా ప్రభుత్వం అడుగులు: ఎమ్మెల్యే నల్లమిల్లి

**కరపత్రం ప్రతినిధి సత్తి వెంకటరెడ్డి,అనపర్తి):**



ప్రజలందరికీ క్యాన్సర్ పరీక్షలు చేస్తూ ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని అదేవిధంగా ప్రభుత్వ వైద్యులు కూడా చక్కటి సేవలు అందిస్తున్నారని ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అనపర్తి ఏరియా ఆసుపత్రిలో ప్రభుత్వం మంజూరు చేసిన సుమారు 11 లక్షల నిధులతో (రెండు టాబ్స్, లాప్రోస్కోపిక్ సర్జరీ కిట్, ఐపీ వార్డులలో నాలుగు ఏసీలు) ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించారు. లాప్రోస్కోపిక్ విధానం లో గైనకాలజిస్టకు శిక్షణ ఇప్పించి త్వరలో కార్పొరేట్ కి ధీటుగా వైద్య సేవలు అందించనున్నట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి తెలిపారు. విద్య వైద్యానికి ప్రధాన భాగ్య స్వామి కల్పిస్తూ కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామ గుర్రెడ్డి, మేడపాటి సత్యన్నారాయణ రెడ్డి (అన్నవరం), వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు మహానుభావుల త్యాగ ఫలితమే జిబిఆర్

» అమ్మిరెడ్డి విగ్రహానికి నివాళులు



**కరపత్రం ప్రతినిధి (సత్తి వెంకటరెడ్డి, అనపర్తి):**
ఇద్దరు మహానుభావులు పడాల అమ్మిరెడ్డి, గొలుగూరి బాపిరాజు త్యాగ ఫలితమే నేటి జిబిఆర్ విద్యాసంస్థల ఏర్పాటుకు కారణమని,కీర్తిశేషులు పడాల అమ్మిరెడ్డి కళాశాల ఏర్పాటుకు ఎంతో త్యాగం చేశారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కొనియాడారు. సోమవారం జిబిఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే పడాల అమ్మిరెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే నల్లమిల్లి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ స్త్రీ విద్యను ప్రోత్సహించేందుకు కీర్తిశేషులు గొలుగూరి బాపిరాజు కళాశాల ఏర్పాటుకు తలపెట్టడం అటువంటి పరిస్థితుల్లో అనుమతి రావడం కష్టమైన పరిస్థితుల్లో పడాల అమ్మిరెడ్డి తమ వ్యక్తిత్వాన్ని సైతం పక్కనపెట్టి జనతా పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి మారి కళాశాల స్థాపనకు కృషి చేయడం జరిగిందని తెలిపారు.ఇంకా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కళాశాల కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి, రాష్ట్ర సర్పంచుల సమైక్య మాజీ అధ్యక్షులు పడాల వెంకట రామారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు, సొసైటీ చైర్మన్ కొవ్వూరి శ్రీనివాసరెడ్డి(దత్తుడు శ్రీను), తేతలి నారాయణరెడ్డి, మామిడిశెట్టి శ్రీను, షేక్ దరియా, మాజీ వైస్ ఎంపీపీ మల్లిడి శ్రీనివాసరెడ్డి, వెంకన్న బాబు తదితరులు ఉన్నారు.

# ట్రాలీలు,టబ్బులు పంపిణీ



**కరపత్రం ప్రతినిధి తూ.గో.జిల్లా**
ప్రతి ఇంట్లో తడి–పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడం ద్వారా పారిశుధ్య నిర్వహణ మరింత సులభతరం అవుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. సోమవారం బిక్కవోలు ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆరికరేవుల,మెళ్ళూరు,ఇల్లపల్లి గ్రామ పంచాయతీలకు తడి పొడి చెత్త టబ్బులు,ట్రాలీలు పంచాయతీ కార్యదర్శులకు ఎమ్మెల్యే నల్లమిల్లి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ సనాతన బోర్డు ఏర్పాటు చేయండి

- పాతాళ గంగలో దర్గా తొలగింపు తెలుగు ప్రజల విజయం
- హిందువులు అన్యమతస్థుల కుట్రలను తిప్పికొట్టండి
- గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించండి
- సి ఎస్ డి ఎస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల రాజశేఖర్ రెడ్డి



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, తెలంగాణ, ఫిబ్రవరి:9,**
భారత ప్రభుత్వం జాతీయ స్థాయిలో సనాతన బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ స్వామీజీ, ఉపాధ్యక్షుడు విశ్వాత్మానంద, రఘోత్తమ సాధు మహారాజ్ ఆచార్య, సనాతన ధర్మ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి శివస్వాములు, హిందూ సంఘాల నేతలు, ఆధ్యాత్మిక వేత్తలు డిమాండ్ చేశారు. సోమవారం హైదర్ గూడ లోని ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... దేవాలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని, ఆలయాల పరిసర ప్రాంతాలలో అన్యామత కార్యక్రమాలు, వ్యాపారాలు, బోర్డుల ఏర్పాటును వెంటనే తొలగించాలని, డిమాండ్ చేశారు. గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని వారు కేంద్ర ప్రభుత్వానికి కోరుతూ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని సూచించారు. ముఖ్యంగా దేవాలయాల భూములు కబ్జాలకు గురికాకుండా పాలకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. పవిత్ర మైన శైవ క్షేత్రం శ్రీశైలం పాతాళ గంగలో అక్రమంగా నిర్మించిన దర్గా తొలగింపు పై హిందూ సంఘాలు ఛలో శ్రీశైలం పేరిట ఇచ్చిన పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందించడం అభినంద నీయమని శ్రీశైలం పుణ్యక్షేత్రంలోని పాతాళ గంగలో అక్రమంగా వెలిసిన దర్గాను ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 14న చలో శ్రీశైలం కార్యక్రమం వాయిదా వేసినట్లు తెలిపారు. గతంలో దేవాలయాల పరిసరాల ప్రాంతాలలో అక్రమించిన భూములను కూడా వెనక్కి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఆలయ పాలక మండలిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న అన్యమతస్తులను ఉద్యోగాల నుంచి తొలగించాలని, పలు దేవాలయాల వద్ద ముస్లిమ్స్ ప్రతిష్టించిన దర్గాలను కూడా కూల్చివేయాలని వారు డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన అవసరం ఉందని, ఈ దాడులు మతం పిచ్చి నెత్తికెక్కిన వారు చేస్తూ... మానసిక పిచ్చివారు చేశారని పేర్కొనడం తగదన్నారు.

తిరుపతి లడ్డులో కల్తీ నెయ్యి కుట్రదరులను కఠినంగా శిక్షించండి

తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రసాదంగా పంపిణీ జరుగుతున్న లడ్డూలో ఆవు నెయ్యి లేదు, కేవలం కెమికల్స్ మాత్రమే ఉన్నాయని అని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్)దర్యాప్తు నివేదికలో తేలడం అత్యంత విచారకరమని అన్నారు. దీనిపై నిజానిజాలు ప్రజలకు తెలియ జేయాల్సిందిగా ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు చెప్పాలని స్వామీజీలు డిమాండ్ చేశారు. అదే విధంగా దీనికి బాధ్యులైన టీటీడీ బోర్డు మాజీ సభ్యులు, అధికారులను చట్టపరంగా శిక్షించాలని,ఇవన్నీ చూస్తుంటే హిందూ సమాజం పట్ల కుట్ర పూరితంగా కొంతమంది ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. దీనిపై యావత్ హిందూ సమాజం మేల్కొని హిందూ ఆలయాల నిర్వహణను హిందూ భక్తుల చేతిలో సనాతన బోర్డును ధార్మిక, సాధు సంతులు, దేవాలయాల కమిటీలు నిర్వహణలు చేపట్టే విధంగా చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరచారి,కిరణ్, మహేష్, రవికిరణ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్ టియూ వ్యవస్థాపకులు సామాల యాదగిరి విగ్రహ ఆవిష్కరణ



**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి 09:**
పోగ్రెసివ్ రికగ్నిషన్ టీచర్స్ యూనియన్ 55 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం నారాయణగూడ లోని పిఆర్ టియు భవన్ లో పిఆర్ టియు వ్యవస్థాపకులు సామల యాదగిరి విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శివసేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు డాక్టర్ గణేష్ గౌటే సామల యాదగిరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పిఆర్ టియు సంఘం ఏర్పడిన నుండి ఉపాధ్యాయుల సమస్యల్ని తనదైన శైలిలో పరిష్కరిస్తున్న సంఘం తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి సంఘం పిఆర్ టియు సంఘం అని అన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీ పాల్ రెడ్డి, పిఆర్ టియు రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్, మాజీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గుండు లక్ష్మణ్, మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో సర్పంచ్‌లకు కొత్త అధికారాలు

» అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యత సర్పంచ్‌లకు
» అక్రమాలను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం
» సర్పంచ్ చైర్మన్‌గా 11 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు
» పౌష్టికాహార నాణ్యత, పంపిణీని తనిఖీ చేయనున్న ఈ కమిటీ
» పిల్లలు, గర్భిణులకు పోషకాలు అందేలా చూడటమే లక్ష్యం

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్**
తెలంగాణలోని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అధికారాలు అప్పగించింది. ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను పూర్తిగా సర్పంచ్‌లే చూసుకోనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పౌష్టికాహారం పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టి, అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.
గతంలో రెండేళ్లపాటు గ్రామాల్లో ఎన్నికైన పాలకవర్గాలు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ పూర్తిగా గాడితప్పింది. చాలాచోట్ల పౌష్టికాహారం పక్కదారి పడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఇటీవలే కొలువుదీరిన కొత్త పంచాయతీ పాలకవర్గాలకు ఈ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సర్పంచ్‌ల నేతృత్వంలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనుంది.
ఈ కమిటీకి సర్పంచ్ చైర్మన్‌గా వ్యవహరించనుండగా, మొత్తం 11 మంది సభ్యులు ఉంటారు. అంగన్‌వాడీ టీచర్ కన్వీనర్‌గా, ఏఎన్ఎం, స్కూల్ సైన్స్ టీచర్, ఒక రిటైర్డ్ ఉద్యోగి, చిన్నారుల తల్లులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ప్రతి నెలా కేంద్రాలకు అందుతున్న బియ్యం, పప్పు, బాలామృతం, గుడ్లు, పాలు వంటి సరుకుల నాణ్యతను, పంపిణీని తనిఖీ చేస్తుంది. ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న భోజనాన్ని కూడా పరిశీలిస్తుంది. లక్షల రూపాయల విలువైన పోషకాహారం లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడటమే ఈ కమిటీ ప్రధాన విధి.

# కలెక్టర్, అబ్జర్వర్ సమక్షంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



**కరపత్రం ప్రతినిధి వికారాబాద్, ఫిబ్రవరి:9,**
మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండ మైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్, జనరల్ అబ్జర్వర్ జి.రవి ల సమక్షంలో సోమవారం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండ మైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు.ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న వికారాబాద్, తాండూర్, కొడంగల్, పరిగి మున్సిపాలిటీ లకు సంబంధించి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ సుధీర్, డిఈఓ రేణుకా దేవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ మేయర్ నీలగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

**నిజాంపేట్, ఫిబ్రవరి 09 కరపత్రం ప్రతినిధి**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ నీలగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా ప్రగతి నగర్ నాయకులు నీల గోపాల్ రెడ్డి ని శాలువతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి నగర్ నాయకులు బొట్ల తిరుపతి, శరత్ రెడ్డి, వడ్లకొండ సందీప్, విజయభాస్కర్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.